క్లుప్తంగా

ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలి



చెరుకుపల్లి: ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలని బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) సయ్యద్ అక్తర్ హుసేన్ కౌలు రైతులకు సూచించారు. మండలంలోని ఆరుంబాక, చెరుకుపల్లి గ్రామాల్లో సోమవారం కౌలు రైతు కార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుసేన్ మాట్లాడుతూ కౌలు రైతులు కార్డులు పొందటం ద్వారా ప్రభుత్వ పరంగా వచ్చే అన్ని రాయితీలు పొందవచ్చన్నారు. కౌలు కార్డులు పొందేందుకు భూ యజమాని పట్టాదారు పాస్‌పుస్తకం నకలు, ఆధార్ నకలు, కౌలు రైతు ఆధార్, ఫొటోతో గ్రామంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను గానీ, రెవెన్యూ అధికారులను గానీ సంప్రదించి కౌలు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

రేపల్లె: చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని పట్టణ సీఐ మల్లికార్జునరావు హెచ్చరించారు. పట్టణంలోని రాధాకృష్ణ లాడ్జిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను సోమవారం సాయంత్రం ఆయన అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.36,238 స్వాధీనం చేసుకొని మాట్లాడారు. స్థానికుల సమాచారంతో తమ సిబ్బందితో లాడ్జిలో దాడులు నిర్వహించగా పేకాట ఆడుతూ నిందితులు పట్టుబడ్డారన్నారు. నిందితులతో పాటు లాడ్జి నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



రేపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలను తెలియజేశారు. 25వ వార్డుకు చెందిన షేక్ షాబానా ఈ నెల 10వ తేదీ రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. దీంతో కుటుంబ సభ్యులు షాబానా కోసం బంధువులు, స్నేహితుల వద్ద గాలించిన ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. షాబానా అత్త షేక్ గౌసియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఆంగ్ల అధ్యాపకుడు రాజేష్‌కు డాక్టరేట్



కర్లపాలెం: బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం మార్పు చెన్నాయ్‌వారిపాలెంకు చెందిన పేరలి రాజేష్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. రాజేష్ ప్రస్తుతం గుంటూరులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. ఫెయిత్ జస్టిస్–సోషియో–పొలిటికల్ రిఫార్మ్స్–ఎ కంపారిటివ్ స్టడీ ఆఫ్ మార్టిన్ అండ్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ అనే అంశంపై ఫార్మర్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ పటేటి పర్యవేక్షణలో అధ్యయనం చేశారు. వర్సిటీ రీసెర్చ్ సెల్ కో ఆర్డినేటర్ ఆచార్య పి.సుధాకర్ రాజేష్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఆంగ్ల విభాగాధిపతి ఆచార్య బి.కరుణ, వివిధ విభాగాల ఆచార్యులు, పలువురు ప్రముఖులు రాజేష్‌ను అభినందించారు.

బైక్ చోరుల అరెస్ట్

తెనాలిరూరల్: బైక్ చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కఠెవరం గ్రామానికి చెందిన నాగసాయికృష్ణ తన పల్సర్ బైక్‌ను గత నెల 30వ తేదీ రాత్రి ఇంటి ముందు నిలిపాడు. మర్నాడు ఉదయం లేచే సరికి బైక్ కనబడకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి నిందితులను కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన అబూబకర్ బేగ్, బాలగంగాధర్ తిలక్‌లుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి బైక్‌ను రికవర్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నిందితులు గతంలో గుడివాడ వన్ టౌన్, టూ టౌన్, మచిలీపట్నం, హనుమాన్‌జంక్షన్, రాజమండ్రి టౌన్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పలు నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చారని ఎస్ఐ తెలిపారు.

చెత్త వేర్వేరుగా అందజేయండి

తెనాలిఅర్బన్: ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తను వేర్వేరుగా విభజించి కార్మికులకు అందజేయాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. 31వ వార్డులో సోమవారం ఆమె పర్యటించారు. చెత్త సేకరణ తీరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తడి, పొడి, హానికర చెత్తలుగా విభజించి సేకరించడం జరుగుతుందన్నారు. నూరు శాతం చెత్త సేకరణ జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమె వెంట పలువురు శానిటేషన్ విభాగ ఉద్యోగులు ఉన్నారు.

'పల్లె పండుగ' పేరుకేనా..?!



భట్టిప్రోలు నుంచి అక్కివారిపాలెం వెళ్లే రహదారి దుస్థితి



అధ్వానంగా వేమూరు నుంచి చావలి వెళ్లే మార్గం



తెనాలి–చినపరిమి మార్గం పరిస్థితి

వేమూరు నియోజకవర్గంలో అధ్వానంగా పలు రహదారుల దుస్థితి



వేమూరు–చినపులివర్రు మధ్య మరమ్మతులు పూర్తికాని రహదారి

వేమూరు : కూటమి ప్రభుత్వంలో ఆర్భాటంగా ప్రకటించిన పల్లె పండుగ పేరుకే పరిమితమైంది. సంక్రాంతి లోపు గ్రామీణ ప్రాంతాల రహదారులను మెరుగుపరుస్తామని డాంభికాలు పలికిన ప్రభుత్వ పెద్దలు రహదారుల మరమ్మతులు చేపట్టడంలో చేతులెత్తేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు, వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాలకు వెళ్లే రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధ్వానంగా తదయారయ్యాయి. మెటల్ పోసిన రోడ్లపై వాహనదారులు రాకపోకలు సాగించడానికి నరకం చూస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న మెటల్ కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవడంతో పాటు, తీవ్ర స్థాయిలో వెలువడుతున్న దుమ్ము వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. తక్షణం రహదారుల నిర్మాణాలు, మరమ్మతులు పూర్తి చేయాలని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహనా సదస్సు



కౌలు కార్డు కోసం అధికారులకు దరఖాస్తు అందిస్తున్న కౌలు రైతు

కొల్లూరు : పంట సాగుదారు హక్కు పత్రాలపై కౌలు రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండి కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని అనంతవరం, చిలుమూరు గ్రామాలలో రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రతి ఏడాది 11 నెలల కాల వ్యవధిగా మంజూరు చేసే సీసీఆర్‌సీ కార్డులు పొందడానికి కౌలుకు పంట పండిస్తున్న రైతులు భూ యజమాని పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, మొబైల్ నంబర్‌తోపాటు, కౌలుకు భూమి సాగు చేస్తున్న కౌలుదారుడి ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతోపాటు, రూ.10 రెవెన్యూ బాండ్‌పై ఒప్పంద పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతు కార్డులు కారణంగా కౌలుదారునికి భూమిపై ఎటువంటి హక్కు ఉండదన్న విషయాన్ని భూ యజమానులు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వరరావు, వీఆర్ఓలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు



భట్టిప్రోలు బౌద్ధ స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ, ప్రజా సంఘాలు, బౌద్ధ సంఘాల నేతలు

భట్టిప్రోలు (కొల్లూరు) : బుద్ధ జయంతి వేడుకలను భట్టిప్రోలు బౌద్ధ స్థూపం వద్ద సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, ప్రజా సంఘాలు, బౌద్ధ సంఘాల నేతల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా తొలుత బుద్ధ భగవానుడు, డాక్టర్ అంబేడ్కర్ చిత్ర పటాలతో బౌద్ధ స్థూపం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ బుద్ధ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. బౌద్ధ క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. రాష్ట్రంలో అమరావతి, నాగార్జునసాగర్ బౌద్ధ స్థూపాలకు ముందే భట్టిప్రోలు స్థూపం నిర్మితమైందని, దీనిని దృష్టిలో ఉంచుకొని బౌద్ధ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచి ధారా రవికిరణమై, ఆది ఆంధ్ర నవబుద్ధిస్ట్ సొసైటీ కార్యదర్శి దోవా రమేష్, బోధి కంచర్ల కోటేశ్వరరావు, బోధి గుంటి సురేష్‌కుమార్, రాంజీ బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు దారం సాంబశివ, ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు బసవ కోటేశ్వరరావు, యానాది మహానాడు రాష్ట్ర కన్వీనర్ కూరేటి మాణిక్యరావు, జై భీమ్ రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్రె కోటయ్య, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బడుగు గోపి, ఎస్సీ టీచర్స్ యూనియన్ రేపల్లె డివిజన్ నాయకుడు దర్శి భాస్కరరావు, ది ఆది ఆంధ్ర నవబుద్ధిస్ట్ సొసైటీ కార్యవర్గ సభ్యుడు జడ రవీంద్రబాబు, జాలాది మోజెస్, న్యాయవాది కొనకాల ప్రసాద్, దాసరి వెంకటేశ్వరరావు, తురిమెళ్ల శ్రీధర్, పొతార్లంక శివవెంకటేశ్వరరావు, నెరుసు వెంకటరావునాయుడు, కర్ర బాబురావు, దోనెపాటి శాలిని, కనపర్తి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి

- వైద్యసేవలు మరింత మెరుగ్గా ఉండాలని ఆదేశం
- 18న మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుకు ఆదేశం



వైద్యాధికారులతో మంత్రి నాదెండ్ల

కొల్లిపర: కొల్లిపరలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించిన మంత్రి, ప్రభుత్వ ఆసుపత్రిని కూడా తనిఖీ చేశారు. స్థానికులు, రోగులను పలకరించి, అక్కడ అందుతున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అవుట్ పేషెంట్ల సంఖ్య మరింతగా పెరగాలని స్పష్టంచేశారు. ఆసుపత్రిలో ఈనెల 18న మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అవసరమైతే తెనాలి జిల్లా ఆసుపత్రి, గుంటూరులోని సమగ్ర వైద్యశాల నుంచి కూడా వైద్యులను పిలిపించుకోవాలని చెప్పారు. వైద్యశిబిరానికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని హామీనిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్యశిబిరం విజయవంతం కావాల్సిందేనని చెప్పారు.

ఘనంగా అన్నమయ్య జయంతి

తెనాలి: పదకవితా పితామహుడు అన్నమాచార్య జయంతి ఉత్సవాలు సోమవారం సాయంత్రం స్థానిక గీతామందిరంలో నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వరస్వామికి, అన్నమయ్యకు అర్చన చేశారు. అన్నమయ్య జీవిత విశేషాలు, ఆయన రాసిన సంకీర్తనలు గుర్తుచేసుకున్నారు. ఈనెల నాలుగో తేదీన నిర్వహించిన అన్నమయ్య పాటల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. పాటల పోటీల్లో పాల్గొన్న 60 మంది చిన్నారుల్లో 25 మందిని, సీనియర్స్‌లో 40 మందికిగాను ఆరుగురిని ఎంపిక చేసి జ్ఞాపిక, నగదు బహుమతులను అందజేశారు. అనంతరం ప్రముఖ జ్యోతిష్య పండితుడు రాళ్లబండి చంద్రశేఖర్, నృత్యగురువు, చల్లా యామిని, సంగీత గురువు కామిశెట్టి పావనిని సన్మానించారు. ఈఎల్‌వీ అప్పారావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా వేద పండితుడు విష్ణుభట్ల యజ్ఞరామకృష్ణ ఫౌండరీక యాజులు, పంచాంగ రామానుజాచార్యులు, గౌరవరపు ఆంజనేయశాస్త్రి, కృత్తివెంటి కమల, సుజాత, టీవీఎస్ శాస్త్రి, పర్చూరు సుబ్బారావు, నరసింహారావు మాట్లాడారు. కేవలం పిల్లల్లో భక్తి భావం పెంచడానికి, అన్నమయ్య సంకీర్తనల ప్రచార నిమిత్తం ఈ కార్యక్రమాలను జరుపుతున్నామని సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు చెప్పారు. కొండపి వసుంధర, అన్నమయ్య రమాదేవి, రజిని, నంబూరి వినతి, సావిత్రి,లక్కరాజు కనకదుర్గ, మాదల సత్యకుమారి, కల్యాణి, కోగంటి నాగమణి, మూర్తి అనురాధ, బాలాత్రిపుర సుందరి పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నియంత్రణకు చర్యలు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పేర్కొన్నారు. ఆర్ఆర్‌నగర్‌లోని గిరిజన, షెడ్యూలు కులాల బాలికల వసతి గృహాల్లో మలాథియాన్ పిచికారీ చేసిన మందును సోమవారం స్ప్రే చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. దీనిని స్ప్రే చేయడం వలన దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు విద్యార్థినీలకు సోకవని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సిబ్బంది దీపాల శ్రీనివాసరావు, బందారు మల్లేశ్వరరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు, షేక్ నవీద్, షేక్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన ఇరువురికి సత్కారం



కొల్లూరు : కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు పొందిన ఇరువురు మహిళా ఉద్యోగులను సోమవారం ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న కె.వాణి ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం ఎంపీడీవోగా, ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న పి.సునీతను ప్రకాశం జిల్లా ముండ్లమూరు ఎంపీడీవోగా ఉద్యోగోన్నతుల్లో భాగంగా అధికారులు నియమించారు. ఇరువురిని సోమవారం కొల్లూరు మండల పరిషత్ కార్యాలయం విధుల నుంచి ఎంపీడీవో కె.నరసింహారావు రిలీవ్ చేశారు. అనంతరం మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు వారిని ఘనంగా సత్కరించారు.

రథోత్సవం సందర్భంగా అన్నదానం



బాపట్ల : శ్రీక్షీరభావన్నారాయణస్వామి రథోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తొలుత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అన్నం సతీష్ ప్రభాకర్ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరరావు, కొటికం సుబ్బారావు గురుస్వామి తదితరులు ఉన్నారు.

ప్రేక్షకులను ఆకట్టుకున్న చింతామణి నాటకం

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలోని రాజుల కాలనీలో నిర్వహిస్తున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా ప్రదర్శిస్తున్న సాంఘిక, పౌరాణిక నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం రాత్రి ప్రదర్శించిన చింతామణి పౌరాణిక నాటకం (భవానీ శంకరుని సీను) ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. భవానీ శంకరుడిగా తాడిబోయిన నాగేశ్వరరావు, చింతామణిగా భానుమతి నటించి ప్రేక్షకులను మెప్పించారు. తాడిబోయిన నాగేశ్వరరావు ఆలపించిన పద్యాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం వేషధారులను కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో గంపల శివనాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, పూసపాటి కొండంరాజు, అశోక్ గజపతిరాజు, వెంకటేశ్వరరాజు, నారాయణరాజు తదితరులు ఉన్నారు.

వృద్ధులకు అన్నదానం



తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో సోమవారం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు పెనుమూడి సువార్త జ్ఞాపకార్థం ఆమె మనుమరాలు మంచికలపూడి విజయ వెంకటేశ్వరరావు ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఆమె మాట్లాడుతూ నేటి యువత సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని అన్నారు. పట్టణానికి చెందిన పులివర్తి సుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వీరబ్రహ్మం, పార్వతీ దంపతులు సేవా కార్యక్రమం నిర్వహించారు. వీరబ్రహ్మం మాట్లాడుతూ ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారిని అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాది శాఖమూరి నారాయణరావు, యార్లగడ్డ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

రేపల్లె : సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. పీఎం కిసాన్ యోజన పథకంకు ఒక అర్జీ, పంట కాలువ పునరుద్ధరణకై ఒక అర్జీ, విద్యుత్ సమస్యపై ఒక అర్జీ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు ఒక అర్జీ అందినట్లు తెలిపారు. ఆయా అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలి

తహసీల్దార్ నాంచారయ్య



మాట్లాడుతున్న తహసీల్దార్ నాంచారయ్య

నగరం: గ్రామ సభలు ఏర్పాటు చేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలని తహసీల్దార్ జి.నాంచారయ్య చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి కౌలు రైతును గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందించాల్సిన బాధ్యత వీఆర్వోలు, వీఏఏలదేనన్నారు. గ్రామాలలో రైతులు, కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి కౌలు గుర్తింపు కార్డులు అందజేసేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో రమేష్ బాబు, ఏఈవో నాగశ్రీనివాస్ పాల్గొన్నారు.

సహనంతో వైద్య సేవలు అందించాలి

ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సుధాకర్



కేకు కట్ చేస్తున్న ప్రభుత్వ వైద్యశాల నర్సులు

రేపల్లె : రోగులకు సహనంతో కూడిన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సుధాకర్ తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్యశాలకు అనేక రుగ్మతలతో వచ్చే రోగుల పట్ల ప్రేమతో వ్యవహరించాలన్నారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో వైద్య సేవలు అందించాలని చెప్పారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు నర్సులను సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు చైతన్య, గణేష్, వైద్య సిబ్బంది, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సిడిమాను ఊరేగింపు



సిడిమాను ఊరేగింపులో భక్తులు

నిజాంపట్నం: వేలాది మంది భక్తుల జయజయ ధ్వానాల నడుమ విద్యుత్ కాంతుల అలంకరణతో సిడిమాను ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. నిజాంపట్నంలోని మొగదారమ్మ తల్లి ఉత్సవాలలో భాగంగా గ్రామ వీధులలో సిడిమాను ఊరేగింపు ఆదివారం అర్ధరాత్రి నిర్వహించారు. గ్రామస్తులు అడుగడుగునా సిడిమానుకు పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. అందులో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు దంపతులు సిడిమానుకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మొగదారమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. ఉత్సవాలలో భాగంగా భక్తులు అమ్మవారికి మొక్కుబడులను చెల్లించి నైవేద్యాలను సమర్పించారు. ఉత్సవాలలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో పోటెత్తింది.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను విశేషంగా ఆకట్టున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది.

బర్లి పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

బాపట్ల: బర్లి పొగాకు రైతులను ఆదుకోవాలని కోరుతూ పర్చూరు మండలం చెరుకూరు గ్రామ రైతులు రైతు, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేయాలని కంపెనీలకు చెప్పినా ఆచరణలో అమలు కాలేదని తెలిపారు. కంపెనీల తీరు రైతుల ఆత్మ విశ్వాసం దెబ్బ తీసే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కంపెనీలపై ఒత్తిడి తెచ్చి కొనుగోలు చేయించాలని, నేరుగా మార్క్‌ఫెడ్ లాంటి సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. వ్యవసాయ సీజన్ వస్తున్నా పొగాకు అమ్మకాలు జరగకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. అనేక మంది ఆత్మహత్యలకు కూడా పూనుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ జోక్యం మరింత అవసరమని అర్జీలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకుపోతామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కే శ్రీనివాసరావు, పొగాకు రైతులు సాదిక్, శివయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విధులకు సకాలంలో హాజరు కావాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: విధులకు సకాలంలో హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. 3వ శానిటేషన్ డివిజన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్‌ను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదని తెలిపారు. కార్మికులందరూ ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మురుగు కాల్వలు నిర్మించండి

తెనాలిఅర్బన్: 12వ వార్డు డొంక రోడ్డులో 12 సంవత్సరాల కిందట సిమెంట్ రోడ్డును నిర్మించి కాలువలు నిర్మించలేదని, దీనివలన మురుగు పోయే దారి లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసి శ్రీను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కాలువలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఆర్వో రాంప్రసాద్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.